# సంక్షేమ పథకాలపై ఇంటింటి ప్రచారం



గంట్రావుపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పెద్దకొత్తపల్లి, అక్టోబర్ 13 : మండలంలోని గంట్రావుపల్లిలో సీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలపై గ్రామ బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకుడు శేఖర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి తాలూకాలో గతంలో కంటే అత్యధికంగా నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేశారని ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులపై ప్రజలకు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే బీరంకు ఓట్లు వేసి మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. పార్టీలకతీతంగా అనారోగ్యాలకు గురైన కుటుంబాలకు ఎల్‌వోసీలు మంజూరు చేయించి ఆదుకున్న నాయకుడు ఎమ్మెల్యే బీరమని కొనియాడారు. కార్యక్రమంలో చిన్నకొత్తపల్లి పార్టీ అధ్యక్షుడు విష్ణు తదితరులు ఉన్నారు.

### బీరం విజయానికి ప్రచారం..

పెద్దకొత్తపల్లి, అక్టోబర్ 13 : మండలంలోని అన్ని గ్రామాల్లో కార్యకర్తల సమావేశాలు నిర్వహించి విస్తృత ప్రచారాలు నిర్వహిస్తామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గణేశ్‌రావు తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుంచి మండలంలో కార్యకర్తల సమావేశాలు నిర్వహించి ఎమ్మెల్యే బీరం చేపట్టిన అభివృద్ధి పనులు సంక్షేమ పథకాలపై కార్యకర్తలతో గ్రామాల్లో ప్రచారాలు నిర్వహిస్తామని తెలిపారు. గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ సమావేశాలు నిర్వహించాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ పార్టీ విధానాలపై రైతులు, ప్రజలకు తెలియజేయాలని అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలపై ప్రజలకు తెలుపుతామన్నారు.

# కోడ్‌కూసినా.. చెరగని గోడరాతలు,పో స్టర్లు

◆ క్షేత్రస్థాయిలో అధికారుల నిఘావైఫల్యం

కొల్లాపూర్, అక్టోబర్ 13 : కేంద్రఎన్నికల సంఘం ఎన్నికల నియమావళిని విధించి ఐదురోజులు కావొచ్చినా వివిధ పార్టీల నాయకులు గోడలపై రాసిన రాతలు, పోస్టర్లను పూర్తిగా తొలగించలేదు. పట్టణంలోని 4వ వార్డులోని మండల ప్రాథమిక పాఠశాల ఎదుట బీజేపీ జెండా దిమ్మెపై భాగంలో ఉన్న కమలం పువ్వు గుర్తుపై ముసుగు తొలగి అధికారులను వెక్కిరిస్తుంది. చుక్కాయపల్లి మండల ప్రాథమిక పాఠశాలలో ప్రహరీ గోడలు జీఎల్ఆర్ఎస్ ట్యాంక్, విద్యుత్ స్తంభాలు, ఇంటి గోడలపై వివిధ పార్టీల నాయకుల ఫొటోలతో కూడిన పోస్టర్లను పూర్తిగా తొలగించలేక పోవడంతో సదరు నాయకుల ఫొటోచిత్రాలు కనిపిస్తున్నాయి. అసంపూర్తిగా తొలగించిన పోస్టర్లను చూస్తే అయిష్టంగా తొలగించినట్లుగా అవగతమవుతుంది. పట్టణంలోని రంగదాస్‌వీధిలో జిల్లా పరిషత్ మోడల్ హైస్కూల్ ప్రహారీపైన, ఎల్లూరు రోడ్డులో గిరిజన కమ్యూనిటీ భవనం గోడలరాతలు, పోస్టర్లు, ఎల్లూరుకు వెళ్లే ఆర్ అండ్‌బీ కల్వర్టులపై రాసిన రాతలను నేటికీ చెరపలేదంటే ఎన్నికల కోడ్‌ను సంబంధిత అధికారులు ఏ మేరకు అమలు చేస్తున్నారో.. నిర్లక్ష్యానికి ఇది నిదర్శనమని చెప్పక తప్పదు. అధికారులు క్షేత్రస్థాయిలో నిఘా కొరవడిందని ప్రజలు విమర్శిస్తున్నారు.



కొల్లాపూర్‌లో జెడ్పీ హైస్కూల్ గోడపై తొలగించని పోస్టర్లు



కొల్లాపూర్‌లో యూపీఎస్ పాఠశాల ఎదుట కమలం గుర్తు ఇలా...





గిరిజన కమ్యూనిటీ భవనం గోడలపై ఇలా...



చుక్కాయపల్లిలో నీళ్ల ట్యాంక్‌పై తొలగించని రాజకీయ నాయకుల పోస్టర్లు

# పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలు



కొల్లాపూర్ పాఠశాలలో బతుకమ్మ సంబురాలు నిర్వహిస్తున్న చిన్నారులు

కొల్లాపూర్, అక్టోబర్ 13 : పట్టణంలో న్యూబ్లూమ్స్ పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి శుక్రవారం ఘనంగా బతుకమ్మ వేడుకలను జరుపుకొన్నారు. పాఠశాల ఆవరణలో తీరొక్కపూలను సేకరించి తెచ్చి బతుకమ్మలను తయారు చేసి దాన్ని చుట్టూ చిన్నారి విద్యార్థినుల కోలాటాలు వేసి అలరింపచేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఖమరున్నీసాబేగం, కరెస్పాండెంట్ ఎండీ నయీామ్, ఉపాధ్యాయులు నుశ్రత్, సమ్రీన్, మాధవి, మౌనిక, కృష్ణవేణి, మనీషా పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీవోకు శ్రద్ధాంజలి

వీపనగండ్ల, అక్టోబర్ 13 : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీవోగా విధులు నిర్వహిస్తూ వారం రోజుల కింద హత్యకు గురైన బద్రీనాథ్ దశదినకర్మ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది రెండు నిమిషాల పాటు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఏపీవో శేఖర్‌గౌడ్, జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్, ఆపరేటర్ ఎండీ అమీర్, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది

## చురుగ్గా సీసీ రోడ్డు పనులు



చుక్కాయపల్లి శివాలయం వీధిలో జేసీబీతో పనులు చేస్తున్న దృశ్యం

కొల్లాపూర్, అక్టోబర్ 13 : మున్సిపాలిటీ పరిధిలోని చుక్కాయపల్లి శివాలయం వీధిలో మురుగు కాల్వలు లేక అధ్వానంగా మారిన అంతర్గత రహదారులను సీసీ రోడ్లు వేయడంతో పాటు సైడ్‌డ్రైన్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి స్పెషల్ డెవలప్‌మెంట్ నిధుల ద్వారా మంజూరు చేసిన రూ.75 లక్షలతో పనులు చేస్తున్నారు. శివాలయం వీధిలో ముందుగా సైడ్‌డైన్ నిర్మాణం చేపట్టేందుకు జేసీబీతో కాల్వలు పనులు సాగుతున్నాయి. వాస్తవంగా ఆ వార్డుల్లో రహదారులపై ఇండ్ల వెళ్లాలంటే మురికినీటితో బురదగా మారి ప్రజలు నరకయాతనపడుతుండే వారు. గ్రామంలోని బీఆర్ఎస్ నాయకులు, ప్రజలు కోరిక మేరకు ఎమ్మెల్యే బీరం నిధులు మంజూరు చేయడంతో పనులు మొదలు పెట్టడంతో చుక్కాయపల్లి గ్రామస్తులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ నిధులే కాకుండా రూ.10లక్షలతో సైడ్‌డైన్‌లు పూర్తికాగా, 2వ వార్డులో అదనంగా మరో రూ.5లక్షలతో సైడ్రైన్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

## ముగిసిన వైద్యశిబిరం



ఎల్లూరు పంప్ హౌస్ వద్ద వైద్యశిబిరంలో వైద్య సిబ్బంది

కొల్లాపూర్, అక్టోబర్ 13 : జిల్లా వైద్యాధికారి ఆదేశానుసారం మండలంలోని ఎల్లూరు మిషన్ భగీరథ పంప్‌హౌస్ వద్ద శుక్రవారం ఏర్పాటు చేసినా మెగా ఉచిత వైద్యశిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ శిబిరంలో 112 మంది సిబ్బందికి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో మలేరియా, డెంగీ, షుగర్, రక్తపోటు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యశిబిరంలో మిషన్ భగీరథ అసిస్టెంట్ జీఎం ప్రకాష్, మేనేజర్ రమేశ్, డాక్టర్ బాలకృష్ణ, సబ్ యూనిట్ ఆఫీసర్ రామ్మోహన్, కిశోర్, హెల్త్ అసిస్టెంట్లు ప్రభాకర్, దివాకర్, ఉమాపతి, ఏఎన్ఎంలు భాగ్యమ్మ, శ్వేత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంపూర్ణ పారిశుధ్యానికి సహకరించాలి



వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌వో రామయ్య

పాన్‌గల్, అక్టోబర్ 13 : సంపూర్ణ పారిశుధ్యానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాస్ అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని వెంగళాయిపల్లిని సందర్శించి పరిసరాలు, డ్రైనేజీ కాల్వలను, నీటి నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో ఎలాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉండదని తెలిపారు. నీటి నిల్వల వల్ల దోమలు వ్యాప్తి చెంది మలేరియా, డెంగీ తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నదన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాంచంద్రయ్య, సతీశ్, నర్సమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధి పనుల తనిఖీ

వీపనగండ్ల, అక్టోబర్13 : 2022-23 ఉపాధిహామీ పథకంలో భాగంగా రూ.4.78 కోట్లకు సంబంధించిన ఉపాధి పనులను నేటి నుంచి సామాజిక బృందంచే తనిఖీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కతలప్ప అన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు లోబడి మండలంలోని గ్రామాల్లో పర్యటించి తనిఖీ నిర్వహిస్తామన్నారు. సంబంధిత రైతులు సామాజిక తనిఖీ బృందానికి పూర్తిస్థాయిలో సహకరించాలని ఆయన కోరారు.